కురంజి - ఆది

ముద్దుగారే యశోద - ముంగిటి ముత్యము వీడు
దిద్దరాని మహిమల - దేవకీ సుతుడు

అంత నింత గొల్లెతల - యరచేతి మాణిక్యము
పంతమాడే కంసుని - పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల - గరుడ పచ్చపూస
చెంతల మాలోనున్న - చిన్నికృష్ణుడు

రతికేళి రుక్మిణికి - రంగు మోవి పగడము
మితి గోవర్ధనపు గో - మేధికము
సతమై శంఖ చక్రాల - సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచే - కమలాక్షుడు

కాళియుని తలలపైన - గప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీ వేంకటాద్రి - యింద్రనీలము
పాల జలనిధిలోన - బాయని దివ్యరత్నము
బాలునివలె దిరిగె - పద్మనాభుడు.

ఇది తన పలుకు నవరత్నాలతో అన్నమాచార్యులు కూర్చిన నవరత్న సంకీర్తనం. నవరత్నత్వాన్ని శ్రీ వేంకటేశ్వరునకు ఆపాదించడం విశేషం. యశోద ముంగిటి ముత్యం, గొల్లెతల అరచేతి మాణిక్యం, కంసుని పాలిటి వజ్రం, ముల్లోకాలకు కాంతులిచ్చే పచ్చపూస - మరకతం, రతి సమయంలో రుక్మిణికి శోణితాధర విద్రుమం - పగడం, గోవర్ధనమెత్తిన గోమేధికం, శంఖ చక్రాల సందున మెరసే వైడూర్యం, కాళియుని తలలపైన గప్పిన పుష్యరాగం, శ్రీవేంకటాద్రిపై యింద్రనీలం క్షీర జలధిలో నిత్య నివాసియైన పద్మనాభ దివ్య రత్నం అట శ్రీ వేంకటాచలపతి. ఇందులో కొన్ని జ్యోతిష రహస్యాలున్నవి. గ్రహదోష నివారణార్థం ఆయా గ్రహ రత్నాలను ఉంగరంలో , ఆభరణంలో ధరించడం లోకసామాన్యం. నవగ్రహ శాంత్యర్థం నవరత్నధారణ ప్రసిద్ధం. ముత్యంనుండి మొదలై ఈ నవరత్నాలూ ఏ క్రమంలో ఉండాలి అన్నది ఈ సంకీర్తనంలో చెప్పారు అన్నమాచార్యులు. ఏ గ్రహానికైనా ఆ గ్రహపు రాయిని ధరించేటప్పుడు ఆ రాయి లగ్న, పంచమ, భాగ్యాధిపతులైన గ్రహాలకు మాత్రం - ఆ క్రమంలో ధరించవలె. 'లగ్న లగ్నేశ సంబంధౌ, తద్బలాని ప్రబలాని' అని
సూత్రం. కానీ ఏ జాతకుడికైనా శని లగ్న - పంచమ - భాగ్య స్థానాధపతి అయినప్పటికీ

ఇంద్రనీలం ధరించరాదు. ఇంద్రనీలాన్ని ధరించగల సమర్థుడు ఒక్క శ్రీ వేంకటేశ్వరుడేన ని 'శ్రీవేంకటాద్రి యింద్రనీలము' అని స్పష్టం చేశారు అన్నమాచార్యులు. ఇందుకు సాహిత్యంలో ఆధారం శంకరాచార్యుల కనకధారలోని 'బాహ్వన్తరే మురజితః శ్రిత కౌస్తుభేయా హారావళీవ హరినీలమయి విభాతి' అన్నచోట గోచరిస్తుంది. జాతి వైఢూర్యం దాని 'ధార' వల్ల తెలియబడుతుంది. శంఖ చక్రాల మధ్య నున్న వైఢూర్య 'ధార' శ్రీవారి తిరునామం. అసలు విషయం - నవగ్రహ శాంతికై నవరత్నాల ఉంగరం ధరించనక్కరలేదు. రోజూ ఒకసారి ఈ నవరత్న సంకీర్తన గానం చేస్తే చాలు.

నవగ్రహాలు

చంద్రుడు	బుధుడు	శని
రవి	బృహస్పతి	రాహువు
కుజుడు	శుక్రుడు	కేతువు

నవరత్నాలు

ముత్యం

మాణిక్యం

పగడం విద్రుమం

పచ్చ - మరకతం

పుష్యరాగం

వజ్రం

ఇంద్రనీలం

గోమేథికం

వైడూర్యం